ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజా ప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :279 సోమవారం ఆగష్టు 3 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

# అవినీతి రాజ్యమేలుతోంది...

## ఖమ్మం జిల్లా వైరా రవాణా శాఖ కార్యాలయంలో




**అవినీతికి 'కేరాఫ్ అడ్రస్'గా ఖమ్మం జిల్లా వైరా రవాణా శాఖ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ( ఎం వి ఐ,) కోడ్ ఉంటేనే పని.. బ్రోకర్ ఉంటేనే ఫైల్ కదలిక..?ప్రతి సేవకు ఫిక్స్డ్ రేట్లు.. నిబంధనలకు తూట్లు.. ప్రజలకు చుక్కలు..!ప్రజలకు పారదర్శక సేవలు అందించాల్సిన ఖమ్మం జిల్లా వైరా రవాణా శాఖ కార్యాలయం( ఆర్టీఏ,) అవినీతికి అడ్డాగా మారిందన్న ఆరోపణలు జిల్లాలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు సమర్పించినా పని జరగదని, "కోడ్" ఉంటేనే ఫైల్ ముందుకు కదులుతుందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.కోడ్' లేకుంటే ఫైల్‌కు బ్రేక్..!దరఖాస్తులోని వివరాల కంటే వెనుక రాసిన కోడ్‌కే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోడ్ ఉంటే గంటల్లో పూర్తయ్యే పని, కోడ్ లేకుంటే వారాల తరబడి పెండింగ్‌లోనే ఉంటోందని బాధితులు చెబుతున్నారు.**

**'మీ బ్రోకర్ ఎవరు?'మీ కోడ్ ఎంత..?**




(తెలంగాణ స్టేట్ బ్యూరో ప్రత్యేక కథనం ఖమ్మం జిల్లా వైరా రవాణా శాఖ కార్యాలయం)//మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నిఘాలో భాగంగా:కార్యాలయానికి నేరుగా వెల్లిన దరఖాస్తుదారులను "మీ బ్రోకర్ ఎవరు?" అని ప్రశ్నిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బ్రోకర్ పేరు లేదా కోడ్ లేకుంటే ఏదో ఒక సాకుతో దరఖాస్తును పక్కన పెడుతున్నారని పలువురు వాహనదారులు వాపోతున్నారు.ముడుపులు ఇస్తే చాలు..డ్రైవింగ్ రాకున్నా లైసెన్సులు డ్రైవింగ్ నైపుణ్యం లేకపోయినా, బ్రోకర్ల ద్వారా భారీ మొత్తాలు చెల్లిస్తే టూ వీలర్, ఫోర్ వీలర్, హెవీ వెహికల్ లైసెన్సులు సులభంగా పొందుతున్నారన్న ఆరోపణలు పిస్తున్నాయి.




**దీంతో రోడ్డు భద్రతే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.?**కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల హవా..?వైరా రవాణా శాఖ కార్యాలయం పరిసరాల్లో ప్రైవేట్ వ్యక్తులు అధికారిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ వాహనాల ఇంజన్, చాయిస్ నంబర్లు నమోదు చేయడం, దరఖాస్తులను చక్కబెట్టడం జరుగుతోందన్న ఆరోపణలు




ఉన్నాయి..!ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.వెహికల్ చెకింగా .. లేక వసూళ్ల చెకింగా అనే అనుమానాలు తావిస్తున్నాయి.?వాహన తనిఖీల పేరుతో చిన్న చిన్న లోపాలను చూపిస్తూ వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.?జరిమానా రసీదు కంటే నగదు చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఓవర్‌లోడ్ లారీలకు గ్రీన్ సిగ్నల్..?ఇసుక, గ్రానైట్ రవాణా చేసే ఓవర్‌లోడ్ లారీలు నిరభ్యంతరంగా తిరుగుతున్నా తనిఖీలు కేవలం పేరుకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. నెలవారీ మామూళ్ల కారణంగానే చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోన్నేళ్లుగా ఒకేచోట...?ఒకే కార్యాలయంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న కొందరు సిబ్బంది చుట్టూ అవినీతి వ్యవస్థ పాతుకుపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి.ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించిందా అనే ప్రశ్నలు కూడా వ్యక్తమవుతున్నాయి.గతంలో వైరా రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరిగినా తీరుమారని అధికారులు అవసరమైతే మళ్లీ ఏసీబీ అధికారులు నిఘాను వహించి ఏసీబీ, విజిలెన్స్ దాడులు చేస్తే నిజాలు వెలుగులోకి వస్తాయా..?ఈ ఆరోపణలపై జిల్లా కలెక్టర్, రవాణా శాఖ ఉన్నతాధికారులు, ఏసీబీ, విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, సీసీటీవీ ఫుటేజ్, పెండింగ్ ఫైళ్లు, బ్రోకర్ల పాత్రపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **వేచి చూడండి అతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కథనంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రికలో**

మన ప్రజా ప్రతినిధి
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :279 సోమవారం ఆగష్టు 3 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# జైషే కుట్రలో హమీమ్ అరెస్ట్....

●జంతర్‌మంతర్ ఆందోళనల్లో అల్లర్లకు కుట్ర చేసినట్లు ఆరోపణలు
●రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకున్న ప్రణాళికలపై దర్యాప్తు
●ప్రియురాలితో కలిసి హనీట్రాప్, ఉగ్ర నియామకాల యత్నం
●పాకిస్థాన్ హ్యాండ్లర్లతో ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా సంబంధాలు





కోల్‌కతా, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రసంస్థతో సంబంధాలు ఉన్న హమీమ్ మోండల్‌ను, అతనికి సహకరించిన జార్ఖండ్‌కు చెందిన యువతి అర్పిత సర్కార్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు పలు కీలక విషయాలను వెల్లడించారు. దేశంలో అల్లర్లు సృష్టించడం, రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకోవడం వంటి కుట్రలకు సంబంధించి నిందితుల పాత్రపై లోతుగా విచారణ కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో అల్లర్లు సృష్టించేందుకు హమీమ్‌కు జైషే మహ్మద్ హ్యాండ్లర్ల నుంచి ఆదేశాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పోలీసు యూనిఫామ్ ధరించి నిరసన ప్రదేశంలోకి ప్రవేశించాలని, అందుకోసం మహిళలు, పురుషులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించినట్లు వెల్లడించారు. నిందితులు నిజంగా ఢిల్లీకి వెళ్లారా లేదా అనే అంశంపై వారి డిజిటల్ కమ్యూనికేషన్‌ను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ రాజకీయ నాయకుల కదలికలపై సమాచారం సేకరించాలని కూడా హ్యాండ్లర్లు హమీమ్‌ను ఆదేశించినట్లు అధికారులు

2

# అఖిలకు... హరీశ్‌రావు అండ



▫ఎంబీబీఎస్ ఫీజు పూర్తిగా భరిస్తానన్న మాజీ మంత్రి
▫నీట్ రాసిన విద్యార్థినికి ఆత్మీయ భరోసా
▫మెరిడియన్ విద్యాసంస్థ సేవలను అభినందించిన హరీశ్‌రావు
▫పేద విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపు

2

## అవయవ దానంపై అవగాహన పెంచాలి



-విశాఖలో అవయవ దాన అవగాహన సదస్సులో మంత్రి సత్యకుమార్ యాదవ్
-ఒక దాత ఎనిమిది మందికి ప్రాణదాత కావొచ్చని వ్యాఖ్య
-రాష్ట్రంలో అవయవ మార్పిడి కేంద్రాలు 3 నుంచి 9కు పెంపు
-అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు

విశాఖపట్నం, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అవయవ దాన అవగాహన సదస్సులో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. మంత్రి మాట్లాడుతూ, అవయవ దానం మహోన్నతమైన మానవతా సేవ అని పేర్కొన్నారు. ఒక అవయవ దాత ఏకంగా ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపగలడని, సమాజంలోని ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై విస్తృతంగా అవగాహన పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5,900 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని మంత్రి తెలిపారు. 2025లో 93 మంది దాతల ద్వారా 301 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించగా, 2026లో ఇప్పటివరకు 57 మంది దాతల ద్వారా 180 మందికి పునర్జన్మ లభించిందని వెల్లడించారు. అవయవ మార్పిడి సేవలను మరింత విస్తరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాల సంఖ్యను 3 నుంచి 9కు పెంచి, మరింత మందికి నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అవయవ దానం ద్వారా అనేక కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురిస్తాయని మంత్రి

2

## బోనాల ఉత్సవాలకు అమెరికా కాన్సుల్

◆ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించిన లారా విలియమ్స్
◆బోనాల విశిష్టతను వివరించిన మంత్రి పొన్నం ప్రభాకర్
◆తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటే పండుగగా అభివర్ణన
◆సాంస్కృతిక బంధాలు మరింత బలోపేతమవుతాయని ఆశాభావం



2

## ఏఐతో బోనాల భద్రత

▫ఉజ్జయిని మహంకాళి ఆలయంలో సీపీ సజ్జనర్ ప్రత్యేక పూజలు
▫తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్ అమలు
▫2,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
▫ముఖ గుర్తింపు సాంకేతికతతో నేరస్థులపై నిఘా



2

## ఆస్ట్రేలియాతో ఏపీ వ్యూహాత్మక భాగస్వామ్యం



-ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆస్ట్రేలియా ప్రతినిధులతో కీలక భేటీ
-నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలపై సంతకాలు
-స్వచ్ఛ ఇంధనం, ఆధునిక తయారీ, విద్య, నైపుణ్యాభివృద్ధిపై సహకారం
-రాష్ట్ర అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం

2

## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

-రాజమహేంద్రవరంలో నిరుద్యోగ యువత భారీగా హాజరు
-350 మందికి ఉద్యోగాలు..
మరో 450 మందికి అవకాశాల భరోసా
-10 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మార్గాని భరత్ రామ్
-ప్రజాసేవలో భరత్ కృషి అభినందనీయమన్న కొయ్యే మోషేన్ రాజు



2

## జైషే కుట్రలో హమీమ్ అరెస్ట్

మెదటి పేజీ తరువాయి



తెలిపారు. ముఖ్యంగా ప్రతిపక్ష నేత సువేంధు అధికారికి భద్రత తక్కువగా ఉండే ప్రాంతాల వివరాలు తెలుసుకోవాలని సూచించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కుట్ర వెనుక మరింత పెద్ద నెట్‌వర్క్ ఉండే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని దర్యాప్తు విస్తరించారు. నాలుగేళ్ల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా హమీమ్‌కు పరిచయమైన జార్ఖండ్ యువతి అర్పిత సర్కార్ అతనికి కీలకంగా సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. చిన్నస్థాయి రాజకీయ నాయకులతో పరిచయాలు పెంచుకుని, వారి ద్వారా ప్రముఖ నేతల వివరాలు సేకరించడం, తమ అనుచరులను రాజకీయ పార్టీల్లో కార్యకర్తలుగా చేర్పించడం వంటి పనుల్లో ఆమె పాత్ర ఉన్నట్లు అధికారులు తెలిపారు. బెంగాల్‌కు చెందిన ఓ మంత్రి కుమారుడిని హనీట్రాప్ ద్వారా కిడ్నాప్ చేసి డబ్బు వసూలు చేయాలనే కుట్ర కూడా వీరిద్దరూ పన్నినట్లు వెల్లడించారు. అర్పిత సర్కార్‌కు పలువురు రాజకీయ నాయకులతో పరిచయాలు ఉన్నాయని, వారి వ్యక్తిగత, రాజకీయ సమాచారం హమీమ్‌కు చేరవేసినట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు పేర్కొన్నారు. దేశంలో తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం, యువతను ఉగ్రవాద సంస్థల్లో చేర్చేందుకు అవసరమైన నెట్‌వర్క్ ఏర్పాటులో ఈ ఇద్దరూ పనిచేసినట్లు అనుమానిస్తున్నారు. నిందితులు పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో ఎన్‌క్రిప్టెడ్ సందేశాల యాప్‌ల ద్వారా కొన్నేళ్లుగా సంబంధాలు కొనసాగించినట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. వారి వద్ద యునైటెడ్ కింగ్‌డమ్, మెక్సికోకు చెందిన అంతర్జాతీయ సిమ్‌కార్డులు కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పు కలిగించే అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

## ఆస్ట్రేలియాతో ఏపీ వ్యూహాత్మక భాగస్వామ్యం

అమరావతి, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): మెదటి పేజీ తరువాయి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్‌తో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కీలక సమావేశం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్‌ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఏడాది ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా జరిగిన చర్చలకు కొనసాగింపుగా ఇప్పుడు ఆచరణాత్మక చర్యలు ప్రారంభమయ్యాయని మంత్రి లోకేశ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో స్వచ్ఛ ఇంధనం, ఆధునిక తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో నాలుగు కీలక అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరిగినట్లు వెల్లడించారు. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు, విద్యా అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. యువతకు ప్రపంచ ప్రమాణాల నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఆధునిక పరిశ్రమలకు కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం అంతర్జాతీయ భాగస్వామ్యాలను విస్తరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రపంచ స్థాయి సంస్థలతో కలిసి పనిచేసే విధానాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. ఈ భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్‌ఆస్ట్రేలియా సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, విద్య, పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో దీర్ఘకాలిక సహకారానికి బలమైన పునాది వేస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడులు, విద్యా అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు తెలిపారు.

## కావేరి జలాలపై చర్చలకే ప్రాధాన్యం

**-సామరస్యపూర్వక పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం డీకే శివకుమార్**

**-రాష్ట్రంలో తాగునీటి కొరత లేదని స్పష్టీకరణ**

**-రైతుల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు**

**-కేంద్ర సహకారంపై సీఎం ప్రశంసలు**



3

## అఖిలకు... హరీశ్‌రావు అండ

మెదటి పేజీ తరువాయి

హైదరాబాద్, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యపై ఆందోళన చెందుతున్న అఖిల అనే విద్యార్థినికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అండగా నిలిచారు. ఎంబీబీఎస్ సీటు ఎక్కడ వచ్చినా పూర్తి ఫీజును తానే భరిస్తానని హామీ ఇచ్చి ఆమెకు మనోధైర్యం కల్పించారు. బీఆర్ఎస్ విడుదల చేసిన వివరాల ప్రకారం, నాలుగేళ్ల క్రితం అఖిల తండ్రి మృతి చెందడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. ఆ



సమయంలో హరీశ్‌రావును ఆశ్రయించగా, ఆయన చొరవతో అఖిలను మెరిడియన్ విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివించినట్లు పేర్కొన్నారు. ఇటీవల వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షను అఖిల రాయగా, ఆమెను తన నివాసానికి ఆహ్వానించిన హరీశ్‌రావు ఆత్మీయంగా పలకరించి భోజనం పెట్టారు. వైద్య విద్యను కొనసాగించే విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఎంబీబీఎస్ సీటు ఎక్కడ వచ్చినా పూర్తి ఫీజు తానే భరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఆర్థిక కారణాలతో ఉన్నత విద్యకు దూరం కాకూడదన్నారు. విద్యాభ్యాసంలో వెనుకబడిన వారికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అఖిల విద్యాభ్యాసానికి అండగా నిలిచిన మెరిడియన్ విద్యాసంస్థ యాజమాన్యాన్ని హరీశ్‌రావు అభినందించారు. సామాజిక బాధ్యతతో పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్న విద్యాసంస్థలు మరెన్నో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సహాయంతో అఖిల తన వైద్య విద్య లక్ష్యాన్ని సాధించి సమాజానికి సేవ చేసే వైద్యురాలిగా ఎదగాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు. అయితే ఈ వివరాలు బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన ప్రకటన ఆధారంగా వెల్లడయ్యాయి.

## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

మెదటి పేజీ తరువాయి

రాజమహేంద్రవరం, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): రాజమహేంద్రవరం మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మంజీరా కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. 70 ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు సుమారు 1,500 మంది యువత హాజరయ్యారు.



కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ, ఈ ఏడాది నిర్వహిస్తున్న మూడో మెగా జాబ్ మేళా ఇదేనని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకపోయినా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. రాబోయే కాలంలో కనీసం 10 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే తన లక్ష్యమని వెల్లడిం చారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, యువతకు నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని మార్గాని భరత్ రామ్ అన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్, డీఎస్సీ నియామకాలలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, యువత భవిష్యత్తుతో ఎవరూ ఆటలాడకూడదన్నారు. ఉద్యోగం రాకపోయినా ప్రతి ఇంటర్వ్యూ ఒక అనుభవంగా భావించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని యువతకు సూచించారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ, అధికారంలో లేకపోయినా యువత కోసం మెగా జాబ్ మేళాలు నిర్వహించడం మార్గాని భరత్ రామ్ ప్రజాసేవకు నిదర్శనమని కొనియాడారు. ప్రజాప్రతినిధిగా ఉన్న సమయంలో రాజమహేంద్రవరం అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. యువత తమ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. మెగా జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగుల్లో 350 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి మార్గాని భరత్ రామ్ నియామక పత్రాలు అందజేశారు. మరో 450 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక జాబితాను సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జాబ్ మేళా నిర్వహణకు సహకరించిన సంస్థల ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, తలారి వెంకటరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గుడూరి శ్రీనివాస్, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు అమెరికా కాన్సుల్

హైదరాబాద్, ఆగస్టు 2 (మన ప్రజాప్రతినిధి): మెదటి పేజీ తరువాయి



సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్‌కు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ఉజ్జయిని మహంకాళి ఆలయ విశిష్టతతో పాటు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను లారా ఈ. విలియమ్స్‌కు వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే లష్కర్ బోనాల ఉత్సవాల విశిష్టతను, బోనం సమర్పణ అనంతరం నిర్వహించే సంప్రదాయ 'రంగం' కార్యక్రమం ప్రాముఖ్యతను కూడా మంత్రి వివరించారు. ఈ పండుగ తెలంగాణ ప్రజల భక్తి, విశ్వాసాలు, సాంస్కృతిక వైభవానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. తెలంగాణ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ వేదికపై పరిచయం చేసే అవకాశంగా ఈ సందర్శన నిలుస్తుందని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. అమెరికా కాన్సుల్ జనరల్ బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా తెలంగాణఅమెరికా మధ్య సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లారా ఈ. విలియమ్స్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతిని ప్రత్యక్షంగా అనుభవించడం ఆనందంగా ఉందని పేర్కొన్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగాయి.

## ఏఐతో బోనాల భద్రత

హైదరాబాద్, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): మెదటి పేజీ తరువాయి



ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీపీ సజ్జనర్, భాగ్యనగరంలో బోనాల పండుగకు గొప్ప చారిత్రక నేపథ్యం ఉందన్నారు. గోల్కొండ, బల్కంపేట బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయని తెలిపారు. ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, నిఘా వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలకు అనుసంధానంగా ముఖ గుర్తింపు సాంకేతికతను వినియోగిస్తున్నామని సీపీ చెప్పారు. దీని ద్వారా పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను వెంటనే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, క్యూలైన్లలో రద్దీని ఏఐ సాయంతో విశ్లేషించి పరిమితికి మించి జనసమ్మర్థం ఏర్పడితే వెంటనే చర్యలు తీసుకుని తొక్కిసలాటలు జరగకుండా చూస్తామని తెలిపారు. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పనిచేస్తున్నామని సీపీ సజ్జనర్ పేర్కొన్నారు. భక్తులు పోలీసు శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, ట్రాఫిక్ డీసీపీ అవినాశ్ కుమార్, అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అవయవ దానంపై అవగాహన పెంచాలి

మెదటి పేజీ తరువాయి

అన్నారు. ఈ గొప్ప సేవలో యువత, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు, సామాజిక సంస్థలు చురుకుగా పాల్గొని ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఈ సదస్సులో వైద్య నిపుణులు, అవయవ దాన సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందని మంత్రి తెలిపారు.



మన ప్రజాప్రతినిధి
సోమవారం ఆగష్టు 3 2026


# కావేరి జలాలపై చర్చలకే ప్రాధాన్యం




బెంగళూరు, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): కావేరి నదీ జలాల పంపిణీ సమస్యను సామరస్యపూర్వక చర్చల ద్వారానే పరిష్కరించడమే కర్ణాటక ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారని, అయితే రాష్ట్రంలోని జల పరిస్థితులు మెరుగైన తర్వాత సమావేశం నిర్వహించాలని సూచించినట్లు వెల్లడించారు. రాష్ట్ర జలాశయాల పరివాహక ప్రాంతాల్లో ఇటీవల మంచి వర్షాలు కురుస్తుండటంతో పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగినంత నీటిని నిల్వ ఉంచామని చెప్పారు. కబిని జలాశయం పూర్తిగా నిండిపోవడంతో అదనపు నీరు సహజంగానే దిగువకు ప్రవహిస్తోందని వివరించారు. కావేరి జలాల పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని శివకుమార్ పేర్కొన్నారు. గతంలో తీవ్ర కరవు పరిస్థితులు ఉన్నప్పటికీ తమిళనాడు 9.9 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరిందని, ఆ మేరకు కావేరి జల నిర్వహణ ప్రాధికార సంస్థ సూచనలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం వాటిపై అప్పీల్ దాఖలు చేసినట్లు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ రాష్ట్రానికి అన్ని దశల్లో సహకారం అందిస్తున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. కృష్ణా జలాల పంపిణీ, తుంగభద్ర ఆనకట్ట మరమ్మతులు, నవిలె బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం, కృష్ణాగోదావరికావేరి నదుల అనుసంధానం వంటి అంశాల్లో కేంద్రం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. కొడుగు ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రస్తుతం జలాశయాల్లో 57 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉందని సీఎం తెలిపారు. ప్రతిరోజూ 3,500 క్యూసెక్కుల నీటిని కావేరిలో విడుదల చేస్తున్నామని, జలాశయాలు పూర్తిగా నిండిపోవడంతో అదనపు నీరు సహజ ప్రవాహంగా వెళ్తోందని వివరించారు. రాష్ట్రంలో తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు రైతుల ప్రయోజనాలను కాపాడటానికే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఇప్పటికే కేఆర్ఎస్, కబిని కాలువలకు సాగునీటిని విడుదల చేసి రైతులు సాగు చేసిన పంటలను రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు.

# పెరూలో ఘోర విమాన ప్రమాదం

**-కుప్పకూలిన పర్యాటకుల విమానం**
**-13 మంది దుర్మరణం**
**-జర్మనీ, స్పెయిన్, ఇటలీకి చెందిన పర్యాటకులు మృతి**
**-ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు**



లిమా, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): దక్షిణ అమెరికా దేశమైన పెరూలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. పర్యాటకులతో వెళ్తున్న ఓ టూరిస్ట్ విమానం నజ్కా నగర శివారులో కుప్పకూలి పేలిపోవడంతో విమానంలో ఉన్న మొత్తం 13 మంది మృతి చెందారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. పెరూ మున్సిపల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, పెరూవియన్ సంస్థకు చెందిన ఎరోడియానా టూరిస్ట్ విమానం శనివారం ఇకా ప్రాంతం నుంచి నజ్కా వైపు బయలుదేరింది. విమానంలో 11 మంది విదేశీ పర్యాటకులతో పాటు ఇద్దరు విమాన సిబ్బంది ప్రయాణిస్తున్నారు. ప్రయాణ మధ్యలో నజ్కా నగర శివారులోకి చేరుకున్న సమయంలో విమానం ఒక్కసారిగా అదుపుతప్పి కిందకు దూసుకెళ్లి నేలపై కూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే విమానం భారీ పేలుడుతో మంటల్లో చిక్కుకోవడంతో అందులో ఉన్న వారంతా సజీవదహనమైనట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు జర్మనీ, ఇద్దరు స్పెయిన్, ఏడుగురు ఇటలీకి చెందిన పర్యాటకులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇద్దరు విమాన సిబ్బంది కూడా ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. విమానం కుప్పకూలడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. సాంకేతిక లోపమా, వాతావరణ పరిస్థితుల ప్రభావమా అనే కోణాల్లో అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాద స్థలంలో శిథిలాలను పరిశీలిస్తూ ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై పెరూవియన్ పౌరవిమానయాన అధికారులు సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# వారమైన దివ్యాంగుని జాడ లేదు

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్: చిన్ననాటినుండి మానసిక వైకల్యంతో ఉన్న 24 ఏళ్ల యువకుడు అఖిల్ కనిపించకుండా పోయి వారం రోజులు గడిచినా ఇప్పటి వరకు ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కుమారుడి కోసం తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అంబేద్కర్ నగర్ వాటర్ ట్యాంక్ వద్దనున్న తన నివాసం నుండి గత ఆదివారం ఉదయం 11 గంటలకు బయటకు వెళ్ళిన అఖిల్ ఆచూకీ వారం రోజులైనా తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు రామాచారి, ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదు. కాగా దివ్యాంగుడైన అఖిల్ కు సరిగ్గా మాటలు రావని, కనీసం తన అడ్రస్ గానీ, తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ గాని ఎవరికి చెప్పలేడు కాబట్టి ఈ కేసును పోలీసులు ప్రత్యేకంగా గుర్తించి గాలింపు చర్యలను వేగవంతం చేయాలని కుటుంబ సభ్యులు, స్థానికులు, ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ యువకుడి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని లేదా 9866784884 నంబర్ కు సమాచారం అందివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.




# గొల్ల కేరి పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆషాడ మాసం సందర్భంగా



సదాశివాపేట //(మనప్రజా ప్రతినిధి ): సదాశివాపెట లో ఆదివారం రోజు బోనాలు భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విచ్చేసి ముందుగా బోనాలకు పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు భారీ ఎత్తున బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తూ దుర్గమ్మ మందిరంకు చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు కనుల పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, చింత సాయినాథ్, గొల్ల కేరి పద్మశాలి సేవా సంఘం సభ్యులు మధునాల నర్సింహులు, గుజ్జరి ఆంజనేయులు, చింత చంద్రశేఖర్, చింత ఆనంద్ కుమార్, వెంకటాపురం నాగేష్, మేకల జనార్ధన్ (పద్మశాలి పట్టణ అధ్యక్షులు), గంజి రామచందర్, వల్లకాటి సురేష్. జొన్న ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ధూప దీపా నైవేద్యానికి, వితంతువులకు ఆసరా అందిస్తున్న మొహమ్మద్ రఫీ





మన ప్రజాప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా: చేగుంట మండల, పట్టణ ప్రజలకు, నిరుపేద కుటుంబాలకు, దేవాలయాల అభివృద్ధికి, ఎల్లప్పుడూ ముందుండి ఆర్థిక సహాయం అందిస్తూ, మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తున్న, చేగుంట పట్టణ ఉపసర్పంచ్, మైనార్టీ నాయకులు మొహమ్మద్ రఫీ. సమాజంలో మనుషులంతా ఒక్కటే అనే నినాదంతో, ముందుకు సాగుతున్న ఆయన, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ఆరు నెలలుగా నిరంతరంగా ప్రజలకు అండగా నిలుస్తున్నారు. పట్టణానికి చెందిన శ్రీను అనారోగ్యంతో మరణించగా, భార్య రాణి తన మూడేళ్ల కుమారుడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న దయనీయ పరిస్థితిని చూసి రఫీ చలించిపోయారు. ప్రభుత్వ పింఛన్ మంజూరయ్యే వరకు ఆ కుటుంబానికి తన సొంత సంపాదన నుంచి ప్రతి నెలా రూ. 2,000 ఆర్థిక సహాయం అందిస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి క్రమం తప్పకుండా సాయం అందజేస్తున్నారు. మరోవైపు కులమతాల భేదాలకు అతీతంగా సేవలు అందిస్తున్న ఆయన... పట్టణంలోని ఉజ్జయిని దేవాలయం, పెద్దమ్మ దేవాలయం, చిన్న శివనూరులోని ఆలయంతో పాటు వెల్దుర్తి మండలం తుల్జాపూర్ మహంకాళి దేవాలయాల అభివృద్ధికి లక్షలాది రూపాయల విరాళాలు అందజేస్తూ, దేవాలయాల్లో నిత్య ధూప దీప నైవేద్యాల నిర్వహణ కోసం తన వంతు సహాయంగా ప్రతి నెలా, ఒక్కొక్క గుడికి రూ. 8,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. పదవి వచ్చిన తర్వాత హామీలను మరచిపోయే, నేటి రాజకీయ వాతావరణంలో, నిరుపేదలకు అండగా నిలుస్తూ గత ఆరు నెలలుగా నిరంతరం సేవలు అందిస్తున్న రఫీని చేగుంట మండల, పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. ఆయన సేవాభావం ఇతర ప్రజాప్రతినిధులందరికీ ఆదర్శమని కొనియాడుతున్నారు.

# కొమురవెల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం



మనప్రజాప్రతినిధి//కొమురవెల్లి,జనగామ: జనగామ నియోజకవర్గం. కొమురవెల్లి మండల కేంద్రంలో ఆదివారం రోజున నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో కొమురవెల్లి, చేర్యాల, చేర్యాల టౌన్, దూల్మిట్ట, మద్దూరు మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి తూముకుంట. ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆగస్టు ఐదవ తేదీలోపు మండల కమిటీలను, అలాగే ఆగస్టు పదిహేను తేదీలోపు గ్రామ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, పార్టీ కోసం నిజాయితీగా, కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకే సంస్థాగతంగా ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. కార్యదర్శి స్థాయిలో ఉన్న నాయకుడు సమర్థవంతంగా పనిచేస్తే ఆయనకు వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి కల్పిస్తామని, అలాగే వైస్ ప్రెసిడెంట్ హోదాలో ఉన్న వారు పార్టీ కోసం ఆశించిన స్థాయిలో పనిచేయకపోతే వారిని తిరిగి కార్యదర్శి పదవికి డిమోషన్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ పదవులు కేవలం హోదాల కోసం కాకుండా బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని, ప్రజలకు వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కొమురవెల్లి, చేర్యాల, చేర్యాల టౌన్, దూల్మిట్ట, మద్దూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## శ్రీ మహంకాళి మందిరం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన సామూహిక బోనాల ఉత్సవం
## ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి పులిమామిడి రాజు



సదాశివపేట, ఆగస్టు 2 (మన ప్రజాప్రతినిధి ):సదాశివపేట పట్టణంలోని చాపలకేరిలో శ్రీ మహంకాళి మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక బోనాల ఊరేగింపు ఉత్సవం భక్తిశ్రద్ధల మధ్య పోతురాజుల విన్యాసాలతో, జోగిని బోనంతో యువకుల డాన్సులతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జోగిని బోనం అందరిని అలరించింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ సందర్భంగా సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ, 11వ వార్డు కౌన్సిలర్ వైద్యం గోపిప్రియాంక పవన్, 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమతతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు.ప్రతి సంవత్సరం ఆనవాయితీగా పులిమామిడి రాజు దంపతులు అమ్మవారికి బంగారు కళ్లతో పాటు బంగారు నుదుటి తిలకాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి సమర్పించడం విశేషంగా నిలిచింది. భక్తి పారవశ్యంతో సమర్పించిన ఈ కానుకలు భక్తుల ప్రశంసలు అందుకున్నాయి.ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ, చాపలకేరిలో వెలసిన శ్రీ మహంకాళి అమ్మవారు మహిమగల దేవతగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్నారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారని, భక్తితో కోరుకున్న కోరికలు నెరవేరుతున్నాయని అన్నారు. ప్రతి సంవత్సరం ఆదివారం నిర్వహించే బోనాల ఊరేగింపు చాపలకేరి నుండి దుర్గాభవాని ఆలయం వరకు అత్యంత వైభవంగా సాగి, అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందని పేర్కొన్నారు.ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, కౌన్సిలర్లు పులిమామిడి మమత, వైద్యం గోపి ప్రియాంక పవన్ , శంకర్ గౌడ్, నర్సింలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, విద్యాసాగర్ రెడ్డి, కోవూరి విజయ్, షాజ్జి భాయ్, బిట్ల ప్రేమ్, లడ్డు వెంకన్నబాబు, శ్రీ మహంకాళి మందిరం అధ్యక్షుడు నల్ల సుధాకర్ , కార్యదర్శి శంకర్, కమిటీ సభ్యులు చాపల హన్మంతు, బంటు రవి, అఖిల్, క్రిష్ణ, ప్రవీణ్, నరేందర్, మనోహర్, ఆనంద్ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.

## చేర్యాల పట్టణ అభివృద్ధిపై స్పందించిన ఎంపీ చామల



మన ప్రజాప్రతినిధి దినపత్రిక, చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. చేర్యాల పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ నుండి ఆకునూరు వరకు ఆర్ అండ్ బి. రోడ్డు విషయం గురించి భువనగిరి పార్లమెంట్ సభ్యులు.చామల కిరణ్ కుమార్ రెడ్డి ని చేర్యాల మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు,ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు కొమ్ము రాజేశ్వరి మరియు మహమ్మద్ షరీఫా బేగం కలిసి చేర్యాల ఆకునూరు ఆర్ అండ్ బి రోడ్డు అధ్వాన్న పరిస్థితి గురించి పేపర్ కటింగ్ తో సహా ఎంపీ కి సవివరంగా వివరించి అలాగే మున్సిపల్ పాలకవర్గం చేసిన ఏకగ్రీవ తీర్మానం ఆమోద పత్రాన్ని ఎంపీ కి సమర్పించి మీ ద్వారా రోడ్ల భవనాల శాఖ మంత్రి.కోమటిరెడ్డి వెంకటరెడ్డి,దృష్టికి తీసుకెళ్లవలసిందిగా కోరగా వారు సానుకూలంగా స్పందించి మంత్రి తో మాట్లాడడం జరిగింది.ఈ మధ్య పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేర్యాలకు విచ్చేసిన ఎంపీ చామల కి స్వయంగా రోడ్డు దుస్థితిని కొమ్ము నర్సింగరావు,చూపించడం జరిగింది.మరియు జిల్లాలో చిన్న మండలం ఐన జగదేవపూర్ పట్టణంలో ఆర్ అండ్ బి డివిజన్ కార్యాలయం ఉన్నది.ఉమ్మడి వరంగల్ జిల్లా లో పాత తాలూకా కేంద్రంగా చేర్యాల నియోజకవర్గం మరియు మున్సిపాలిటీ గా చేర్యాల మండల కేంద్రంగా ఉంది. ఇలాంటి చేర్యాలలో ఆర్ అండ్ బి డివిజన్ కార్యాలయం అవసరం ఎంతైనా ఉంది.ఈ విషయమై ఎంపీ,ద్వారా మంత్రి,దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చేర్యాల మండల మాజీ కో ఆప్షన్ నెంబర్ ఎండీ ఖాజా,శనిగారి బిక్షపతి,తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్ కోసం... క్యాలెండర్ లో ఒక రోజు పుట్టింది



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్ట్ 02: చేగుంట మండలం చందాయిపేట్ లోని సీఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలలో 1998 పదవ తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు, ఈ సందర్భంగా మన ప్రజాప్రతినిది దినపత్రిక ప్రత్యేక కథనం.ఫ్రెండ్స్ కోసం క్యాలెండర్ లో ఒకరోజు పుట్టింది, ఆగస్టు మొదటివారం అంటే చేతికి ఫ్రెండ్ షిప్ బ్యాండ్ కట్టుకోవడం, పాత ఫోటోలు, స్టేటస్ లో పెట్టడం, హ్యాపీ ఫ్రెండ్షిప్ డే అని ఒక మెసేజ్ పది గ్రూప్లో ఫార్వర్డ్ చేయడం మాత్రమే చాలామందికి తెలుసు, కానీ ఈరోజు వెనుక ఒక పెద్ద ఆలోచన కొంతమందికే తెలుసు. ఈ కథ మొదలైంది 1930లో. ప్రముఖ హాల్మార్క్ కార్డ్స్ వ్యవస్థాపకుడు జాయిస్ హాల్ ఒక చిన్న ప్రశ్న వేశారు... 'జీవితంలో మనల్ని ఎక్కువగా భరించే ఫ్రెండ్స్ కోసం ప్రత్యేకంగా ఒక రోజు ఎందుకు ఉండకూడదు?' అని. ఆ ఆలోచన అలా గాల్లో కలిసిపోలేదు.దాదాపు మూడు దశాబ్దాల తర్వాత, 1958లో పరాగ్వేకు చెందిన డాక్టర్ రామోన్ ఆర్టెమియో బ్రాచో దాన్ని 'వరల్డ్ ఫ్రెండ్షిప్ క్రూసేడ్' ఉద్యమంగా మార్చారు. అలా ఆగస్టు మొదటి ఆదివారం ఫ్రెండ్షిప్ డేగా ప్రజాదరణ పొందింది. ఆ సంప్రదాయాన్ని భారత్, అమెరికా, బంగ్లాదేశ్, మలేషియా వంటి దేశాలు కూడా కొనసాగించాయి.ముఖ్యంగా ఆదివారం కావడంతో స్కూల్, కాలేజీ, ఉద్యోగాల ఇబ్బంది లేకుండా స్నేహితులు కలుసుకునేందుకు ఇది అనువుగా మారింది.తర్వాత 2011లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ శాంతి, స్నేహాన్ని దినోత్సవంగా ప్రకటించినా... అప్పటికే ప్రజల జీవితాల్లో ఆగస్టు మొదటి ఆదివారం ఒక సంప్రదాయంగా స్థిరపడిపోవడంతో, భారత్ సహా అనేక దేశాలు ఇప్పటికీ అదే రోజున ఫ్రెండ్ షిప్ డే జరుపుకుంటున్నాయి.ప్రోత్సహించే ఉద్దేశంతో జూలై 30వ తేదీని అంతర్జాతీయ స్నేహ దినోత్సవం ప్రకటించిన అప్పటికి ఇప్పటికీ ప్రజల జీవితాల్లో ఆగస్టు మొదటి ఆదివారం ఒక సంప్రదాయంగా స్థిర పడిపోవడంతో భారత సహా అనేక దేశాలు ఇప్పటికీ ఇదే రోజున ఫ్రెండ్షిప్ డే జరుపుకుంటున్నాయి.

## నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు



నేరేడుచర్ల /(మన ప్రజా ప్రతినిధి దినపత్రిక) సృష్టిలో తీయనిది స్నేహమని, అరమరికలు లేని స్నేహబంధం కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్స్ బట్టు మధు, చల్లా ప్రభాకర్ రెడ్డి, ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి, చార్టర్ ప్రెసిడెంట్ కొనతం సీతారాం రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు షేక్ యూసుఫ్‌తో పాటు సభ్యులు పరస్పరం ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని స్నేహబంధాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్నేహం మనుషుల మధ్య ఐక్యత, పరస్పర ప్రేమాభిమానాలు, నమ్మకం, సహకారాన్ని పెంపొందిస్తుందని అన్నారు. నోరులేని పశుపక్షులు సైతం స్నేహభావంతోమెలుగుతాయని, ప్రతి ఒక్కరూ స్నేహస్ఫూర్తితో సమాజంలో సత్సంబంధాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలు, అవసరార్థులకు అందించే సేవా కార్యక్రమాల వెనుక స్నేహభావమే ప్రధాన శక్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు.అనంతరం క్లబ్ అడ్వైజరీ ఆనరబుల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన రాచకొండ విజయలక్ష్మి, సభ్యునిగా ఎన్నికైన కొప్పు లక్ష్మీనారాయణలను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, కోశాధికారి బి. సైదులు నాయక్, ఉపాధ్యక్షులు గుండా సత్యనారాయణ, మూలగుండ్ల వెంకటరెడ్డి, నీలా శ్రీనివాస్, బాల వెంకటేశ్వర్లు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, అడ్వైజరీ కమిటీ సభ్యులు, పూర్వ అధ్యక్షుడు బోనగిరి అంజయ్య, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులు వీరవెల్లి శ్రీలత, పోలిశెట్టి శ్రీధర్, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, గరినే జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్షిప్పులు- ఫీజు రియంబర్స్ మెంట్ కై ఉద్యమించండి




విద్యార్థి లోకానికి బీసీ నేత ధనుంజయ నాయుడు విజ్ఞప్తి: హైదరాబాద్ (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ) స్కాలర్షిప్ లు-ఫీజు రియంబర్స్మెంట్ కై విద్యార్థి లోకం ఉద్యమించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నాడు హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని బీసీ కార్యాలయం రాష్ట్ర కార్యాలయం లో బీసీ ముఖ్య నాయకులైన బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి వెంకటేశ్వరరావు రాష్ట్ర సహాయ కార్యదర్శులు పల్నాటి యాదయ్య, విజయుడు ఉపేంద్ర చారి తో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ..... స్కాలర్షిప్ లకు మరియు ఫీజు రియంబర్స్మెంట్ కు నిధులు లేవని రాష్ట్ర ముఖ్యమంత్రి పదేపదే ప్రకటించడం బాధ్యతారాహిత్యమని, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలల కాలం గడిచిందని ఈ 33 నెలల కాలంలో వివిధ పన్నుల రూపంలో ప్రభుత్వానికి 7 లక్షల కోట్ల రూపాయలు ఆదాయం సమకూరిందని, అలాగే నాలుగు లక్షల కోట్ల రూపాయలు వివిధ బ్యాంకుల నుంచి అప్పుగా తెచ్చారని మొత్తం 11 లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షల మంది చదువుకునే విద్యార్థులకు సంబంధించి కేవలం ఎనిమిది వేల కోట్ల రూపాయలు చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని చెప్పడం బాధ్యతారాహిత్యం కాదా అని ప్రశ్నించారు. ఈ పథకానికి ఏటా రెండువేల కోట్లు కేటాయించినట్లయితే ప్రతి సంవత్సరం ఈ విధంగా బడ్జెట్ లో నిధులు కేటాయించినట్లయితే బకాయిలు ఇంతగా పెండింగులో ఉండేవి కావని లేదా ఆరు నెలలకు ఒకసారి ఒక వెయ్యి కోట్లు కేటాయించినా ఈ 8 వేల కోట్ల రూపాయల బకాయిలు పేరకపోయి ఉండేవని కానీ ఈ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని అటక ఎక్కించటం బాధాకరమని ఆయన అన్నారు విద్యార్థులను జైల్లో పెట్టడానికి రూపొందించిన జీవో నెంబర్ తొమ్మిది తక్షణమే రద్దు చేయాలని, ఎన్నికల సందర్భంగా నేటి పాలకులు నాటి ఎన్నికల సభలో హామీలు ఇచ్చిన విధంగా డిగ్రీ- పీజీ- ఇంజనీరింగ్ -ఫార్మసీ విద్యార్థులకు ప్రభుత్వమే పూర్తిగా ఫీజులు భరించాలని ఆయన డిమాండ్ చేశారు

## తెలుగుదేశం పార్టీ దిమ్మె ధ్వంసం చేయడం సిగ్గుచేటు



నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిధి దినపత్రిక) నేరేడుచర్ల మండలం బోడలదిన్నె గ్రామంలో నిర్మించిన తెలుగుదేశం పార్టీ జెండా దిమ్మెను ధ్వంసం చేయడం పట్ల తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య పట్టణ పార్టీ అధ్యక్షుడు పొనుగోటి జంగారావు ప్రధాన కార్యదర్శి చందమళ్ళ వెంకన్న సందర్శించి పరిశీలన చేసి విచారం వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించిన తర్వాతే సామాన్య ప్రజానీకానికి రాజకీయ అవగాహన కలిగినారని ఈనాడు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు యావత్ బారతదేశ స్థాయిలో అమలు పరుస్తున్నారంటే అది ఎన్ టి రామారావు గారి వేసిన పునాది వారి ఆలోచనా విధానం వల్ల నేనని కొన్ని యేండ్ల నుండి టీడీపీ అధికారంలో లేకున్నా ప్రజలకు పార్టీ పై ఉన్న అభిమానం చెక్కు చెదరక పోవడమే అందుకు నిదర్శనమనీ అలాంటి మహానుభావుడు పెట్టిన పార్టీ జెండా దిమ్మెను ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని దీనిని అరాచక చర్యగా గుర్తించాలనీ గ్రామంలో ప్రశాంత వాతావరణం నకు విరుద్ధ చర్య అని దిమ్మెను ధ్వంసం చేసిన విషయమై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యల నిమిత్తం ఉన్నత స్థాయి పోలీసు అధికారులకు మరియు జిల్లా ఎస్ పి సూర్యాపేట గారికి దరఖాస్తు ఇస్తామని నాయకులు ఇంజమూరి వెంకటయ్య పొనుగోటి జంగారావు చందమళ్ళ వెంకన్న పత్రికా ముఖంగా తెలిపారు.

# రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాల పంపిణీ





మన ప్రజ ప్రతినిధి తెలుగు దీన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్ట్ 02: మెదక్ జిల్లా మాసాయిపేట మండల వ్యాప్తంగా గత నెలలో మాసాయిపేట మండల ప్రజల కోసం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల (ఐ క్యాంపు) కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ ఐ క్యాంపులో నిపుణులైన వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు అవసరమైన లబ్ధిదారులను గుర్తించారు. అనంతరం వారికి ప్రత్యేకంగా కంటి అద్దాలను తయారు చేయించి, నేడు మాసాయిపేట మండల కేంద్రంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాజన్న ఫౌండేషన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అవసరమైన వైద్య సేవలు పొందలేని ప్రజలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజన్న ఫౌండేషన్ ప్రతినిధులుమరియు మాసాయిపేట సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ పసుల వెంకటేష్ ముదిరాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ నాగిరెడ్డి, పిఎస్ ఎస్ డైరెక్టర్ ఊదండపురం నర్సింలు, మాజీ ఎంపీటీసీ చెరుకు సిద్ధిరాములుగౌడ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు గుండారం శ్రీనివాస్, సర్పంచ్ రాము నాయక్, వివిధ గ్రామాలకు సంబంధించిన సర్పంచులు మరియు వార్డ్ మెంబర్లు లబ్ధిదారులు పాల్గొన్నారు

# ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గండ్ల పోచమ్మకు మొక్కులు చెల్లింపు




మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 02 ఆగస్టు :ఆషాడ మాసం పురస్కరించుకొని ఇల్లంతకుంట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రసిద్ధి చెందిన గండ్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇల్లంతకుంట నుండి సిరిసిల్ల వెళ్లే మార్గంలో గుట్టల మధ్య కొలువైన ఈ పుణ్యక్షేత్రాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా భక్తులు దర్శించుకుంటారు. ఆదివారం ప్రెస్ క్లబ్ సభ్యులు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆషాడ బోనాల సందర్భంగా ప్రజలంతా భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. గండ్ల పోచమ్మ ఆలయం ఆహ్లాదకరమైన ప్రకృతి మధ్య ఉండటంతో ఆదివారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, పాల్గొన్నారు.

# సదాశివాపేట పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

సదాశివపేట//(మన ప్రజాప్రతినిధి):ఆదివారం రోజు మధ్యాహ్నం 02:00 గంటల సమయంలో సదాశివపేట పట్టణంలో గల మహబూబ్ పాషా (ముర్షద్) దర్గా ముందర రోడ్ పక్కన ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి వయస్సు అందాజ 50-55 సంవత్సరాలు చనిపోయి ఉన్నాడు. అట్టి వ్యక్తి నీలం మరియు ఎరుపు రంగు షర్ట్, బ్లూ కలర్ నైట్ ఫ్యాంట్, మృతుడి ఎడమ కాలికి పట్టికట్టి, పురుగులు పట్టి ఉంది. మృతుడి ఆరోగ్యం బాగలేక , సరైన సమయానికి తిండిలేక వైద్యం చేయించుకోలేక చనిపోయినట్లుగా అనిపిస్తున్నది. ఇట్టి విషయంలో సదాశివపేట ౹ాన్రూ ఐ.వెంకటేష్ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి ప్రారంబించనైనది. మృతుడిని ఎవరైనా గుర్తించినచో కింది నంబర్లకి సమాచారం ఇవ్వగలరు. 8712661833, 8712656721,9394310187.





# అంబేద్కర్ నగర్ బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తాం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ అంబేద్కర్ నగర్ బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తామని నూతన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అబ్బగోని రాజ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పొలాస కిరణ్ అన్నారు. స్థానికంగా బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం నూతన ఉత్సవ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎర్ర రాము, పోలాస అశోక్, కర్ణాకర్, సునీల్, స్వామి యాదవ్, నరేందర్, గూడెల్లి సురేష్, వెంకటేష్, క్యాషియర్ చేపూరి యాకయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పోలాస సాయికుమార్, జడల బాలకృష్ణ, భాస్కర్ చారి, యాకేష్ యాదవ్, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులుగా శాంతి కోటేష్ గౌడ్, బల్లి శ్రీను, మారగోని వెంకటేష్, కూతడి సాయి, ఆర్ కే బాబు, బి. శివాజీ, విజయ్ కుమార్, సిద్ధులు యాదవ్, సలహాదారులుగా మానుపాటి రాజయ్య, ముక్క నరసింహులు, మంద ఆనంద్, మేడ సామి, పెద్దాపురం,వెంకటనర్సు, కాయిత రాజు, ఎం. జనార్ధన్, సంగపాక ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా దుర్గేష్, బురుగు కృష్ణ యాదవ్, నరేష్ యాదవ్, సోమ రాజు, బైరపాక మహేందర్, వేణు, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. స్థానిక ప్రజలు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# ఇరాన్‌పై దాడులు నిలిపివేత

**-సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన**

**-ఒప్పందం కోసం మరింత సమయం కోరిన ఇరాన్, గల్ఫ్ దేశాలు**

**-అణు అంశం, హర్మూజ్ జలసంధి ప్రధాన చర్చాంశాలు**

**-దాడులు జరిగితే తీవ్ర ప్రతీకారం తప్పదన్న ఇరాన్ హెచ్చరిక**



వాషింగ్టన్, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): ఇరాన్‌పై ప్రతిపాదించిన సైనిక దాడి ప్రణాళికలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన వివాదాలకు పరిష్కారం కనుగొనే దిశగా జరుగుతున్న చర్చలకు మరింత సమయం ఇవ్వాలన్న ఇరాన్, ఇతర పశ్చిమాసియా దేశాల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ట్రంప్ సామాజిక మాధ్యమ వేదికలో చేసిన ప్రకటనలో, ప్రతిపాదిత ఒప్పందం వేగంగా ఖరారైతేనే అమెరికా సైనిక చర్యలపై విరామం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో సైనిక చర్యలకు అమెరికా సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రపంచ శాంతి, ప్రాంతీయ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని యుద్ధానికి బదులుగా దౌత్యపరమైన పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నామని ట్రంప్ తెలిపారు. యుద్ధాన్ని ముగించి ఇరాన్‌తో ఒప్పందం చేసుకునే ప్రయత్నాలకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఈ విషయంపై ఇజ్రాయెల్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు అమెరికా తమపై ఈ వారాంతంలో ఎలాంటి సైనిక చర్యలకు పాల్పడవద్దని ఇరాన్ హెచ్చరించింది. ఒకవేళ దాడులు జరిగితే తీవ్ర ప్రతీకారం తప్పదని పేర్కొంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని చమురు క్షేత్రాలతో పాటు ఖతార్, ఇజ్రాయెల్‌లోని గ్యాస్ క్షేత్రాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఈ పరిణామాల మధ్య ఒప్పందానికి సంబంధించిన అంశాలపై ఖతార్, పాకిస్థాన్ విడివిడిగా అమెరికా, ఇరాన్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు సమాచారం. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అమెరికా తాజా నిర్ణయం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతిపాదిత ఒప్పందంపై చర్చలు విజయవంతమైతే ప్రాంతంలో యుద్ధ ముప్పు తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నప్పటికీ, పరిస్థితులు ఇంకా సున్నితంగానే ఉన్నాయని పేర్కొంటున్నారు.

